క్లుప్తంగా

రైతులకు నిరంతరం సేవలందించండి



డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి కలెక్టరేట్‌లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ అధికారుల సంఘం 2025 సంవత్సర డైరీని సోమవారం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు జిల్లాలోని రైతులకు నిరంతర సేవలు అందించి వారి మన్ననలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి చంద్రానాయక్, వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షులు నవీన్‌కుమార్, కార్యదర్శి రమేష్‌బాబు రావు, కోశాధికారి వెంకటమోహన్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు నాగమణి, గీత, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయండి



పనులను పరిశీలిస్తున్న పీఆర్ జేఈ రామచంద్ర నాయక్

సుండుపల్లె : మండల కేంద్రంలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పీఆర్ జేఈ రామచంద్ర నాయక్ ఆదేశించారు. సోమవారం మండలంలోని సాయన్నగారిపల్లి, ఆరెమ్మ దేవాలయం వీధులలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. సిబ్బంది, కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల ఏఈ జయసూర్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అనాథ శవం వద్ద కార్యదర్శి, పోలీసు

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని మోహిత్ వైన్స్ సమీపంలో పడివున్న అనాథ శవానికి పంచాయతీ కార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. కార్యదర్శి చెప్పిన వివరాల మేరకు సోమవారం ఉదయం 7 గంటలకు గుర్తు తెలియని ఓ వ్యక్తి(50) మృతి చెందగా స్థానికులు సమాచారం ఇవ్వడంతో విలేజ్ రెవెన్యూ అధికారి పోలీసు సిబ్బందితో కలసి పంచనామా చేసిన తరువాత శవానికి అంత్యక్రియలు చేశామని కార్యదర్శి తెలియజేశారు.

బాధ్యతల స్వీకరణ



రాజకుమార్, పెనగలూరు ఏఈ

పెనగలూరు : మండలం విద్యుత్ ఏఈగా రాజకుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. రాజకుమార్ ప్రొద్దుటూరు డివిజన్‌లో సబ్ ఇంజనీర్‌గా పనిచేస్తూ ప్రమోషన్‌పై పెనగలూరు ఏఈగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాఖ పరంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు.


గ్రంథాలయానికి సొబగులు



నూతన చిత్రీకరణలను ఆవిష్కరిస్తున్న స్వచ్ఛంద సంస్థల సభ్యులు

నందలూరు : నాగిరెడ్డిపల్లి మేజర్ పంచాయతీలోని గ్రంథాలయానికి మరింత ఆకర్షణీయ సొబగులు దిద్ది పాఠశాలకు చేరువ చేసి విజ్ఞానం పెంపొందించుటకు లయన్స్ క్లబ్, వాకర్స్, మానవత సంస్థల ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. గ్రంథాలయం పేరు రాష్ట్ర లోగో, రాష్ట్ర చిహ్నాలను గ్రంథాలయ ప్రహరీ గోడపై సుందరంగా చిత్రీకరించి సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బుచ్చు జయభాస్కర్‌రావు, ఎస్‌ఐ మన్నెం రామ్మోహన్, కుర్రా మణి యాదవ్, వెంకటయ్య, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమానికి సరుకులు వితరణ



ఆశ్రమానికి సరుకులు అందజేసిన దాతలతో మానవత సంస్థ సభ్యులు, దాతలు

చిట్వేలి : శ్రీ దత్తగిరి నారాయణ తపోవన ఆశ్రమానికి దగ్గుపాటి మాధురి, నరేష్‌ల పెళ్లిరోజును పురస్కరించుకొని సోమవారం బియ్యం ప్యాకెట్, నిత్యావసర సరుకులను మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వితరణ చేశారు. రాజంపేట వాసులు సీఎస్‌వీ కృష్ణయ్య (రిటైర్డ్ ఎంఈఓ), నిర్మలమ్మ (రిటైర్డ్ హెచ్‌ఎం) దంపతుల అల్లుడు, కుమార్తెల పెళ్లి రోజు సందర్భంగా సరుకులు వితరణ చేశారు.

రాజంపేటలో కూటమికి..
అందరూ ఇన్‌చార్జ్‌లే!



- కకావికలమవుతున్న క్యాడర్
- తమ ఆదేశాలే పాటించాలంటూ నేతల హుకుం
- సందిగ్ధంలో అధికార యంత్రాంగం

రాజంపేట : పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటకు కూటమికి అందరూ ఇన్‌చార్జ్‌లే అన్నట్లుగా వ్యవహారం నడుస్తోంది. ఇక్కడ ఎనిమిది మంది ఇన్‌చార్జ్‌లు తమేనని వ్యవహరిస్తున్నారు. దీంతో కూటమి క్యాడర్ కకావికలమవుతోంది. అధికార గణం అయితే ఎటు వైపు వెళ్లాలో తెలియని సంకట స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మొత్తానికి రాజంపేటలో దిక్కు దివానం లేని పాలన కొనసాగుతోందన్న విమర్శలు ప్రజాబాహుల్యంలో ప్రచారం ఊపందుకుంది. ఎవరికి మటుకు వారు కార్యాలయాలు పెట్టుకుని, తమ వారికి సాయం చేసేందుకు నేరుగా అధికార గణంకు హుకుం జారీ చేస్తున్నారు.

ప్రోటోకాల్ లేని నేతలు తమపై పెత్తనమేంటంటూ..?

రాజంపేటలో ప్రోటోకాల్ లేని వారు తమపై పెత్తనం చేయడమేమిటి అన్న మీమాంసలో అధికార యంత్రాంగం పడ్డారు. పోలీస్ కేసుల విషయంలో నేరుగా పోలీసుస్టేషన్‌ల వద్దకే వెళ్లి తమ వారిని విడుదల చేయించుకువస్తున్నారు. టాప్-3(ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, నారాలోకేష్)లో తాలుకా అని చెప్పుకుంటూ.. ఏదైనా ఉంటే అమరావతి నుంచి ఫోన్ వస్తుందని అన్ని శాఖల అధికారులపై ఒత్తిడి తెస్తూ పనులు చక్కబెడుతున్నారు. వివిధ గ్రూప్‌ల నుంచి వస్తున్న ఒత్తిళ్లను భరించలేక కొందరు అధికారులు ఎవరి మాట వినకుండా తమ పని తాము చేసుకుంటున్నారు. ఇటీవల ఇన్‌చార్జ్ రేసులో ఉన్న చమర్తి జగన్‌మోహన్‌రాజు కూడా మున్సిపాలిటీ కమిషనర్ బిల్లా నాగేశ్వరరావు పై అవినీతి ఆరోపణలపై నిరసన గళం విప్పారు.

స్పష్టత లేక.. అధికారుల సతమతం

కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత కూటమి నియోజకవర్గ నాయకులు అధికారులపై పెత్తనం సాగిస్తున్నారు. రెవెన్యూ, పోలీసుశాఖతో పాటు ఇతర శాఖల అధికారుల స్వారీ చేస్తున్నారు. సహజంగా అధికారపార్టీకి ఎమ్మెల్యే లేకపోతే ఎవరో ఒకరిని ఇన్‌చార్జ్‌ను నియమించుకుని ఆయన ద్వారా పార్టీ, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ అధికార వినియోగించుకోవడం వస్తున్న ఆనవాయితీ. ఇదంతా అనధికారమే. అయితే ఇప్పటి వరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజంపేట నియోజకవర్గానికి ఇన్‌చార్జ్ ఎవరు? ఏ పార్టీ నుంచి ఉంటారు అనేది స్పష్టత ఇవ్వలేదు. అయితే ఎవరుమటుకు వారు ఇన్‌చార్జీలుగా చలామణి అవుతున్నారు.

ఇన్‌చార్జి రేసులో..

టీడీపీ నుంచి గత ఎన్నికలో ఓడిపోయిన సుగవాసి బాల సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు , పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డిలు ఉన్నారు. వీరిలో ఎవరో ఒకరిని అధిష్టానం నియమించాలి.

కూటమి భాగస్వామ్య నేతల్లోనూ..

తెలుగుదేశం నుంచే కాకుండా కూటమిలో భాగస్వామ్య పార్టీలైన జనసేన, బీజేపీల నుంచి కూడా కొందరు నాయకులు ఇన్‌చార్జ్ పదవిని ఆశిస్తున్నారు. జనసేన పార్టీ పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు యల్లటూరు శ్రీనివాసురాజు, నియోజకవర్గ నేత అతికారి దినేష్‌లు ఉండగా, బీజేపీ నుంచి ఆ పార్టీ పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడులు ఇన్‌చార్జ్ రేసులో ఉన్నారు. కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీలకు సంబంధించి ఇన్‌చార్జ్ గానీ, నామినేటెడ్ పదవులు పంపకం ఇంతవరకు ప్రభుత్వం ఆలోచించలేదు. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా కూటమి అధికారంను వినియోగించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అధికార అజామాయిషీ తలనొప్పిగా తయారైందన్న వాదన అధికారుల్లో నెలకొంది. కాగా ఇన్‌చార్జ్ రేసులో ఉన్న నాయకులు ఎవరాఫీసులు వారు ఏర్పాటు చేసుకుని తమ వర్గ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్నారు.

ఎలక్ట్రీషియన్‌ల సమస్యలను పరిష్కరిస్తాం



జ్ఞాపికను అందుకొంటున్న మంత్రి మండిపల్లి

రాయచోటి టౌన్ : ఎలక్ట్రీషియన్ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం పీడీఆర్ కల్యాణ మండపంలో నిర్వహించిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రాయచోటి పట్టణంలోనే కాకుండా గ్రామీణ ప్రాంతాలలోనూ ఎలక్ట్రీషియన్ పనులు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారని, అలాంటి వారి సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. ప్రధానంగా అర్హత కలిగిన వారికి ఇంటి స్థలాలు మంజూరు చేస్తానని చెప్పారు. అనంతరం ఎలక్ట్రీషియన్ యూనియన్ నాయకులు ఆయనకు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ఎలక్ట్రీషియన్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

సకాలంలో బస్సును నడిపించండి

లక్కిరెడ్డిపల్లి : రాయచోటి నుంచి లక్కిరెడ్డిపల్లి వయా దిన్నెపాడు మీదుగా కడపకు వెళ్లే బస్సు సర్వీసును సకాలంలో నడపించాలని దిన్నెపాడు గ్రామస్తులు సోమవారం రాయచోటిలో రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని కోరారు. రాయచోటి నుంచి లక్కిరెడ్డిపల్లి వయా దిన్నెపాడు, నీలకంఠరావుపేట మీదుగా కడపకు వెళ్లే ఆర్టీసీ బస్సు ఉదయం 6 గంటలకు రాయచోటి నుంచి బయలుదేరి మధ్యాహ్నం ఒంటిగంటకు కడపకు చేరుకోవాలని, అలా కాకుండా ఉదయం 8 గంటలకు బయలుదేరితే విద్యార్థులు, రైతులు పండించిన కూరగాయలు, ఇతరత్ర వస్తువులను ఉదయం పూట వెళ్తే వాటిని సకాలంలో విక్రయించుకోవచ్చని మంత్రికి విన్నవించారు. వీలైనంత వరకు ఈ బస్సు సర్వీసును యథావిధిగా నడపాలని వారు మంత్రిని కోరారు. రోజుకు ఐదు లేదా ఆరుసార్లు తిప్పాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి శంకారపు జయరాం కోరారు. ఇందుకు స్పందించిన మంత్రి వీలైనంత వరకు బస్సు సర్వీసు పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పక్కీరయ్య, ధర్మరాజు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ సంస్థ నుంచి భూములను రక్షించండి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

వీరబల్లి : సమాచారం లేకుండా తమ భూముల్లో ఓ ప్రైవేట్ మైనింగ్ కంపెనీ ప్రతినిధులు సర్వే చేస్తున్నారని, వారి నుంచి తమ భూములను రక్షించాలని మండల రైతులు తహసీల్దార్ శ్రావణిని కోరారు. సోమవారం గుర్రప్పగారిపల్లి పంచాయతీలోని సిటికె అరుంధతివాడ, సిటికె తవటపల్లె, గుర్రప్పగారిపల్లి గ్రామస్తులు తహసీల్దార్‌ను కలిశారు. తమ గ్రామంలో అనధికారికంగా జరుగుతున్న మైనింగ్ సంస్థ చేస్తున్న సర్వేపై చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీలోని రైతులకు చెందిన పట్టా భూములను రక్షించాలని విన్నవించారు. తమకు చెందిన భూములపైనే ఆధారపడి జీవిస్తున్నామని మైనింగ్ సంస్థ కారణంగా తమ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని లేకుంటే తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలియజేశారు. ఈ విషయమై స్పందించిన తహసీల్దార్ పట్టా భూముల రికార్డులు పరిశీలించి న్యాయం చేస్తామని రైతులకు హామీనిచ్చారు.

చెరువు పోరంబోకు భూమిని కాపాడండి

ఓబులవారిపల్లె : కొర్లకుంట అడ్డరోడ్డులో విలువైన చెరువు పోరంబోకు భూమి కబ్జాలకు పాల్పడి ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారని, వాటిని అడ్డుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి చింతలపూడి నాగమ్మ కోరారు. సోమవారం కొర్లకుంట గ్రామంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. జాతీయ రహదారి నుంచి కొర్లకుంట గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో సబ్ స్టేషన్ పక్కన చెరువు పోరంబోకులో కబ్జాలకు పాల్పడి ఇష్టారాజ్యంగా ఇంటి నిర్మాణాలను చేస్తున్నారని, రెవెన్యూ అధికారులు కేసు నమోదు చేసి అడ్డుకున్నా రాత్రి సమయాలలో, సెలవురోజుల్లో అక్రమంగా పనులు చేపడుతున్నారని ఆమె ఆరోపించారు. రెవెన్యూ అధికారులు, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు నియోజకవర్గ కార్యదర్శి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



మండల కేంద్రంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఒంటిమిట్ట సీఐ బాబు

సిద్దవటం : రోడ్డు ప్రమాదాల పట్ల ప్రజలు, వాహనాదారులు అప్రమత్తంగా ఉండాలని ఒంటిమిట్ట సీఐ బాబు తెలిపారు. మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ క్రాస్‌రోడ్డులో సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి ద్విచక్రవాహనాదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను ధరించాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణను పాటించాలన్నారు. ద్విచక్ర వాహనాలలో ఇద్దరి కంటే ఎక్కువ మంది ప్రయాణించకూడదన్నారు. ప్రతి వాహనాదారులు లైసెన్స్‌ను తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. గ్రామల్లో ప్రశాంత పరిస్థితి విఘాతం కలిగించవద్దని తెలియజేశారు. అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సుబ్బరామచంద్ర, పోలీసులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలి



రెడ్డిపల్లి చెరువు వద్ద వాహన తనిఖీ చేస్తున్న ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్

పుల్లంపేట : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పుల్లంపేట ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్ తెలిపారు. సోమవారం రెడ్డిపల్లి డాబా వద్ద వాహనాలు తనిఖీ నిర్వహించి సరైన ధృవీకరణ పత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించి పత్రాలు తమ వద్ద ఉంచుకోవాలని, లేకుంటే చట్టపరమైన ఇబ్బందులు తప్పవన్నారు.

అభివృద్ధిపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న పండుగోలు మణి

రైల్వేకోడూరు అర్బన్ : కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్రంలో అభివృద్ధి అనేది జరగనే లేదని బీకేఎంయూ జిల్లా అధ్యక్షులు పండుగోలు మణి అన్నారు. సోమవారం కోడూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో ఏడు నెలలుగా అభివృద్ధి అనేది లేకుండా పోయిందన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే అభివృద్ధి పనులు చేయించడంల విఫలమయ్యారని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ప్రజలు అధికంగా వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారని వారి కోసం ప్రభుత్వం ఏమీ చేసిందని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం , ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని హితవు పలికారు.

ఉత్తమ సేవలకు పురస్కారం



ధనుంజయ, డీఆర్‌డీఏ, వైఎస్సార్ జిల్లా



వెంకటసుధాకర్‌రెడ్డి, ఎస్ఐ, రామాపురం

రామాపురం/సుండుపల్లె : విధి నిర్వహణలో ప్రజలకు అందించిన సేవలకు గుర్తింపుగా రామాపురం మండల ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డికి ఆదివారం రాయచోటి పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు చేతులమీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. అలానే సుండుపల్లె మండలానికి ధనుంజయ వైఎస్సార్ జిల్లా డీఆర్‌డీఏలో ప్రాజెక్ట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. శాఖ పరంగా ఆయన అందించిన విశేష సేవలకు గాను కడప కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి చేతులమీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు.

ఇంటి స్థలాలు కేటాయించండి

రైల్వేకోడూరు అర్బన్ : వీపీఆర్ కండ్రిక పంచాయతీ తాడివాండ్ల పల్లి గ్రామస్తులు సోమవారం గ్రామంలోని సర్వేనెంబర్ 192లోని ప్రభుత్వ స్థలంలో పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని తహసీల్దార్ మెహబూబ్ చాంద్‌కు వినతి పత్రం అందించారు.

పని భారాన్ని తగ్గించండి



ఎంపీడీఓ రెడ్డయ్యకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

లక్కిరెడ్డిపల్లి : విధి నిర్వహణలో తాము అధిక పని భారాన్ని ఎదుర్కొంటున్నామని, తమపై పడుతున్న పని ఒత్తిడిని తగ్గించాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ రెడ్డయ్యకు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు కలసి ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ వివిధ రకాల సర్వేల పేరుతో తీవ్ర ఒత్తిడి పడుతోందని, దీంతో మానసిక ఇబ్బందులు తలెత్తున్నాయని తెలియజేశారు. రెగ్యులర్‌గా ఇంటిపన్ను వసూలు, గ్రామాలలో తాగునీటి సమస్యలు హెచ్‌డీ పారిశుద్ధ్యం, ఎస్‌డబ్ల్యూపీసీ, పీఆర్, ఏపీపీల నిర్వహణ, స్వామిత్వ సర్వే, జీసిడిపి స్వర్ణాంధ్ర, స్వచ్ఛంద వంటి ప్రభుత్వ కార్యక్రమాలతోపాటు అదనంగా 11 బీఎల్‌ఓలు, డ్యూటీలు కేటాయించలేకపోతున్నామని చెప్పారు. తమపై పడుతున్న భారాన్ని తగ్గించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జయశ్రీ, గణేష్, వేణు గోపాల్, ఇమామ్ బాష, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ ఏర్పాటు

మండలంలోని పదహారు గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు సోమవారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో నూతన యూనియన్‌ను ఏర్పాటు చేశారు. మండల విస్తరణాధికారి ఉషారాణి అధ్యక్షతన మండల యూనియన్ సభ్యులను ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా అనంతపురం గ్రామ కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, కార్యదర్శిగా మద్దిరేవుల కార్యదర్శి రజనీష్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా కోనంపేట డిజిటల్ అసిస్టెంట్ అరవింద్‌ను, మల్లికార్జున రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దుచేయాలి

- 8 నెలలుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలి
- కలెక్టరేట్ ఎదుట సామూహిక నిరాహార దీక్షల్లో యానిమేటర్ల డిమాండ్



కలెక్టరేట్ ఎదుట సామూహిక నిరాహారదీక్షలు చేస్తున్న యానిమేటర్లు

రాయచోటి అర్బన్ : వీఓఏల (యానిమేటర్లు)కు 64 కాల పరిమితి సర్క్యులర్‌ను వెంటనే రద్దుచేయాలని యానిమేటర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రమణ్యం, రెడ్డెప్పరెడ్డి, క్రిష్ణమ్మ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.రామాంజులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెలుగు ఉద్యోగుల సంఘం, సీఐటీయూ రాష్ట్రకమిటీల పిలుపు మేరకు జిల్లాలోని యానిమేటర్లు సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట సామూహికంగా నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక యానిమేటర్లపై పీలేరు, రాయచోటి, తంబళ్లపల్లె, కలకడ, కె.వి.పల్లె, చిన్నమండెం, గాలివీడు మండలాల్లో రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. పలువురిని పదవుల నుంచి తొలగింపులకు పాల్పడడం జరిగిందన్నారు. కనీస పద్ధతులను పాటించకుండా చేపడుతున్న యానిమేటర్ల తొలగింపును సెర్ప్, డీఆర్‌డీఏ అధికారులు చూస్తూ మిన్నకుంటున్నారే తప్ప కూటమి నేతలకు అడ్డుచెప్పే ధైర్యం చేయడం లేదంటూ విమర్శించారు. కొంతమంది అధికారులు సంఘమిత్రలను రికార్డులు అప్పగించాలంటూ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. అక్రమ తొలగింపులకు తమ ప్రభుత్వం వ్యతిరేకమని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు చెబుతుంటే కిందిస్థాయి కూటమి నేతలు మాత్రం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రజల్లో వ్యతిరేకతకు కారణమవుతున్నారన్నారు. ఇప్పటికైనా కూటమి నేతలు స్పందించి 8నెలలుగా ఉన్న పెండింగ్ జీతాల మీద దృష్టిపెట్టాలేకాని తొలగించడం మీద కాదంటూ ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో యానిమేటర్లు మిట్టా రామసుబ్బయ్య, కృష్ణమ్మ, శంకరమ్మ, సుమతి, పద్మావతి, ఈశ్వరమ్మ, జ్యోతి, సీఐటీయూ నేత మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా.. దెబ్బతింటున్న పైప్‌లైన్‌లు



మండలంలోని పార్వతీపురం రోడ్ నెం-3లో వృథాగా పోతున్న తాగునీరు

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 పంచాయతీ పార్వతీపురంలోని రోడ్‌నెంబర్-3 లో తాగునీటి పైప్‌లైన్ పగిలిపోవడంతో నీరు వృథాగా పోతోందని సోమవారం స్థానిక ప్రజలు తెలిపారు. గత రెండు నెలలుగా ఇదే చోట తాగునీటి పైప్‌లైన్ పగిలి ఆ రహదారి చివరి వరకు తాగునీరు వృథాగా పోతుండటంతో రహదారి కుంటను తలపిస్తోందని, పట్టించుకునే నాథుడే లేడని వాపోయారు. చాలా రోజులు నీరు నిల్వ ఉంటుండటంతో దోమల బెడద అధికంగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరగా పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టాలంటూ స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనరసయ్యను వివరణ కోరగా రాత్రి వేళల్లో అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్‌లు పెద్ద ఎత్తున తిరుగుతుండటంతో తరచూ తాగునీటి పైప్‌లైన్ పగిలిపోతోందని, గతంలో పైప్ లైన్ దెబ్బతినడంతో మరమ్మతులు చేశామని చెప్పారు. సమస్య పునరావృతం కాకుండా ఉండేందుకు ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని తెలియజేశారు.

వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో పునరుద్ధరించండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆర్‌వీఎస్ఎస్ సంఘ నాయకులు

చిన్నమండెం : వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో పునరుద్ధరణ చేయాలని ఆర్‌వీఎస్ఎస్ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరికి వారు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం అధ్యక్షులు బంగారు కృష్ణమూర్తి వాల్మీకి పిలుపు మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. కార్యక్రమంలో ఆర్‌వీఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు మండ్ల జయశంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, రాష్ట్ర నాయకులు బండి పరశురాం, దొన్నికొండ ఆనంద్, మేకల శివప్రసాద్, ముద్దుల చిన్న నరసింహులు, జగన్‌మోహన్, బి.రెడ్డయ్య, ఎం.వెంకటాద్రి, మండ్ల మల్లికార్జున, బాలకృష్ణ, రామయ్య, జగదీష్, గంగులప్ప, అశోక్, నారాయణ, వెంకటేష్, సురేంద్ర పాల్గొన్నారు.

నిరక్షరాస్యత లేకుండా చేద్దాం



మాట్లాడుతున్న ఎంపీడీఓ జాషువా

రామాపురం : అన్ని గ్రామాలలో నిరక్షరాస్యత లేకుండా చేద్దామని ఎంపీడీఓ జాషువా, ఏపీఎం దేవయాని పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఉల్లాస్ ప్రోగ్రాం కింద ఎంపికైన 32 మంది డ్వాక్రా సభ్యులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ పరిధిలోని నిరక్షరాసులను విద్యను నేర్పించాలని, చదువుతోపాటు సమాజం పట్ల బాధ్యతలు తదితర విషయాలు నేర్పించాలన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి

సిద్దవటం : ఫిబ్రవరి 5వ తేదీన ఎస్సీ వర్గీకరణ సాధన కోసం చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మునెయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఆదివారం సాయంత్రం చలో విజయవాడకు చెందిన కరపత్రాలను విడుదల చేశారు. ఎమ్మార్పీఎస్ సిద్దవటం మండల అధ్యక్షుడు ముని చంద్ర ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర నాయకుడు మునెయ్య మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం విజయవాడలోని ఐలాపురం కన్వెన్షన్ హాల్‌లో జరిగే కార్యక్రమానికి మండలంలో ఉన్న ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వర్గీకరణ లక్ష్య సాధన కోసం హాజరుకావాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఉప మండలాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

హలో సార్.. ఇది చూశారా.!

పుల్లంపేట : కడప - చెన్నై జాతీయ రహదారి ఎన్‌హెచ్ - 716 పుల్లంపేట వద్ద ప్రమాదాలకు నిలయంగా జాతీయ రహదారి మారింది. రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడటంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. నిత్యం వందలాది వాహనాలు ఈ రహదారిపై ప్రయాణం చేస్తుంటాయి. ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం సాగించాల్సి ఉంటుంది. ప్రమాదాలు జరిగితే గానీ స్పందించరా అని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని వాహనదారులు కోరుకుంటున్నారు.



కడప - రేణిగుంట జాతీయ రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గుంత